

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: పట్టణంలోని నవజీవన్ నిర్వాసిత పిల్లల సేవా కేంద్రానికి గురువారం మోద కొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు చేతుల మీదుగా ప్రసాద కమిటీ సభ్యులు ఉప్పల వెంకటరత్నం, వైదేహి దంపతులు తమ వివాహ దినోత్సవం సందర్భంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సేవా కేంద్రంలోని పిల్లలకు స్వీటు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.


సరుకులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు


గిరి విజ్ఞాన సంబరాలను ప్రారంభిస్తున్న పిఒ

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

▸▸ ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ▸▸ గిరి విజ్ఞాన సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ సూచించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో లోచలి పుట్టు జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో (నెంబర్-1 స్కూల్)లో గురువారం ఆయన జోనల్ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతేడాది కంటే మిన్నగా ఈ ఏడాది రూ.32 లక్షల వ్యయంతో గిరి విజ్ఞాన సంబరాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. గిరి విజ్ఞాన సంబరాల్లో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా విజ్ఞాన సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల గిరిజన విద్యార్థులను శ్రీహరి కోటకు విజ్ఞాన యాత్రకు పంపించామని చెప్పారు. విద్యావంతులైన గిరిజన యువతీ, యువకులకు వేపగుంట వైటిసిలో సివిల్స్ కోచింగ్ అందిస్తున్నామన్నారు. గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఐటిడిఎ నుండి సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తిలకించారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లోని 37 పాఠశాలల నుంచి 6 సబ్జెక్టులకు సంబంధించి 207 నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో కొన్ని నమూనాలను ఈనెల 28, 29, 30 తేదీలలో తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో ఐటిడిఎ స్థాయి గిరిజన విజ్ఞాన సంబరాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


అల్లూరి సీతారామరాజు జిల్లా

సిఐటియు నూతన కార్యవర్గం ఎన్నిక

▸▸ అధ్యక్షులుగా బోనంగి చిన్నయ్యపడాల్
▸▸ ప్రధాన కార్యదర్శిగా వి.ఉమామహేశ్వరరావు


ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా సిఐటియు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు అల్లూరి జిల్లా ప్రథమ మహాసభలు ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన విషయం విధితమే. ఈ సందర్భంగా ఎన్నుకొన్న కొత్త కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా శెట్టి నాగరాజు, ఉపాధ్యక్షులుగా పి. బాలదేవ్, వై.అప్పలనాయుడు, ఎస్‌బి పోతురాజు, కె.భాగ్యలక్ష్మి, కేశవ్, మోస్య, బి.సన్నీ బాబు, సహాయ కార్యదర్శులుగా వి.రామకృష్ణ, జి సత్యనారాయణ, అప్పలకొండ పడాల్, దీనబంధు, కె శంకర్రావు, ఇద్దరు మహిళ కో ఆప్షన్ సభ్యులతో సహా 57మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా మహాసభ పర్యవేక్షకులు జి.బేబీ రాణి సమక్షంలో ఎన్నిక జరిగింది. ఎన్నికైన సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, చిన్నయ్యపడాల్, ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ. అల్లూరు జిల్లాలో సిఐటియు బలోపేతం కోసం యావత్ కార్మిక వర్గాన్ని ఒక తాటిమీద తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అనునిత్యం వారి సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. అల్లూరు జిల్లాలో చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


చిన్నయ్యపడాల్


ఉమామహేశ్వరరావు

గిరిజనులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని ఎన్ఆర్ పురంలో గిరిజనులకు విశాఖ ఎల్ఐసి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్ సంస్థ ప్రతినిధులు 300 మంది గిరిజనులకు దుస్తులు పంపిణీ చేపట్టారు. స్థానిక జెడ్పిటిసి దిసరి గంగరాజు మాట్లాడుతూ,గిరిజనులకు దుస్తులు పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన ఎల్ఐసి వెల్ఫేర్ అసోసియేషన్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల గ్రామాల్లో దుస్తులు లేని నిరుపేదలు ఉన్నారని, వీరికి పంపిణీ చేసినట్లయితే ఈ చలికాలంలో ఉపయోకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఎల్ఐసి వెల్పర్ అసోసియేషన్ సంస్థ ప్రెసిడెంట్ దామోదర్ మాట్లాడుతూ, అంబేద్కర్ పూర్తితో తమ ఎల్ఐసి సంస్థ అసోసియేషన్‌గా ఏర్పడి పేద గిరిజనులకు సహాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే అరుకు, అనంతగిరి మండలాల్లో పలు దపాలుగా మారుమూల గ్రామాల గిరిజనులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్. బి.సన్నమ్మ, మాజి సర్పంచ్ రామయ్య, మాజీ ఎంపిటిసి ఆర్.రవి, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, ఎల్ఐసి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బి.గణపతిరామ్, జి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పిటిసి గంగరాజు

మూగజీవాల మరణాలపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి - విఆర్.పురం: కూనవరంలో వ్యాధులతో ఎడ్లు, గేదెలు, గొర్రెలు, మేకలు ఇతర మూగజీవాలు మృత్యువాత పడుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేదని సిపిఎం రంపచోడవం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మండిపడ్డారు. గురువారం మండలంలోని టేకులబోరు మార్త శ్రీరామమూర్తి భవనంలో పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, మూగజీవాల మరణంతో గిరిజనం లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడం, ఇప్పటివరకు పరిశీలనకు రాకపోవడం దారుణమన్నారు. వ్యాధులు ప్రబలి, మూగజీవాలు చనిపోతున్న గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించాలని, జీవాలే జీవనాధారంగా ఉన్న గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గేదెకు రూ.లక్ష చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. కూనవరం మేజర్ పంచాయతీలో వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల నాయకులు పాయం సత్యనారాయణ, ఉపేంద్ర, మురళి, తాళ్లూరి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, రాధ పాల్గొన్నారు.

విద్యుత్ కేంద్రం వాల్ హౌస్ పరిశీలన

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి నిరంధించే వాల్ హౌస్‌ను విజయవాడ గుణదలలోని ఎపి జెన్‌కో విద్యుత్ సౌదా పనులు ఎస్ఇ సివిల్ ఎం. శేఖర్ స్థానిక జెన్‌కో అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రం విస్తరణలో భాగంగా 115 మెగావాట్ల సామర్థ్యం గల ఐదు, ఆరు యూనిట్లు నూతనంగా నెలకొల్పవలసి ఉంది. దీనికి సంబంధించి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం మొదటి దశ నిర్మాణం సమయంలో ఐదు, ఆరు యూనిట్లకు డిజైన్ చేసి పెనస్టాకు వాల్ హౌస్ సివిల్ స్ట్రక్చర్స్ పనులు పూర్తి చేశారు . ఇటీవల రెండు యూనిట్లు నిర్మాణం కొరకు టెండర్ల ప్రక్రియ అధికారులు పూర్తి చేశారు. నూతనంగా నిర్మించనున్న రెండు యూనిట్లకు కొన్ని అనుమతులు రావాల్సి ఉండగా, పనులు ఇంకా ప్రారంభించలేదు. రెండో దశ నిర్మాణపు పనులు కోసం ఐదు దశాబ్దాల క్రితమే వాల్‌హౌస్ స్ట్రక్చర్స్ పూర్తి చేసిన పనులు. ఏ విధంగా ఉన్నాయనితనిఖీలు నిర్వహించారు. ఐదు ఆరు యూనిట్లు నూతనంగా నిర్మించే ముందు అదనంగా సివిల్ విభాగానికి చెందిన పనులు ఇంకేమైనా చేయవలసి ఉందా అనే కోణంలో కింద స్థాయి ఇంజనీరులతో చర్చించారు. కార్యక్రమంలో మోతుగూడెం ఇఇ బాబురావు ఎడిఇ కొండబాబు ఏఈ పవన్ కుమార్ పాల్గొన్నారు.


వాల్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎస్ఇ శేఖర్


రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల, ఏకలవ్య పాఠశాలల్లో గురువారం ప్రిన్సిపల్స్ డి.శంకర్‌రావు, ఎం.కేశవరావు అధ్వర్యంలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మేథ్స్ నమూనాలు విద్యార్థులు ప్రదర్శించారు.

ఘనంగా గణిత దినోత్సవం

సీలేరు: సీలేరు డిఎవి పాఠశాలలో రామానుజన్ 135 జయంతిని పురస్కరించుకుని గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. డిఎవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన గణిత మోడల్‌ను రూపకల్పన చేసి ప్రదర్శించారు.ఎపి జెన్‌కో ఎస్ఇ సివిల్ కెకెవి. ప్రశాంత్‌కుమార్, ఇఇ జాకీర్ హుస్సేన్ తిలకించి విద్యార్థులను అభినందించారు. గణిత ఉపాధ్యాయులు ఎం.ఫణి శర్మ, బాల నరేష్, శారద, ప్రధానోపాధ్యాయులు రామచంద్రావులను జెన్‌కో అధికారులు అభినందించారు.

మారేడుమిల్లి: : మండలంలో దేవరపల్లి ఆశ్రమ బాలుర పాఠశాలలో హెచ్‌ఎం డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ పిజి హెడ్‌మాస్టర్ ది భాష్యం శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై గణిత శాస్త్రంపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. దేవరపల్లి పాఠశాల ఉపాధ్యాయులు భాష్యం శ్రీనివాసరావు ఆర్యభట్ట వేద గణిత సంఘం ఏర్పాటు చేసి, తన జీతం నుండి రూ.లక్ష కేటాయించి, బ్యాంకులో వేసి వచ్చిన వడ్డీతో విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేస్తున్నారు. గ్రామ సర్పంచ్ లచ్చిరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వికలాంగునికి మూడు చక్రాల స్కూటీ అందజేత

ప్రజాశక్తి- చింతూరు. : చింతూరు మండలానికి చెందిన ఎం.ఎ.ఖలీద్ అనే వికలాంగునికి గురువారం ఐటిడిఎ అడ్మినిస్ట్రేషన్ అధికారి యస్ రాజ్‌కుమార్ రూ.88చ 900 విలువైన మూడు చక్రాల మోటార్ స్కూటీని అందజేశారు. గత సెప్టెంబర్ నెలలో ముఖ్యమంత్రి చింతూరు పర్యటనలో భాగంగా వికలాంగుల అభ్యర్థన మేరకు వాహనాలను మంజూరు చేయగా, చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ ఖాన్ చొరవ తీసుకొని వికలాంగునికి త్రీ వీలర్ స్కూటీ అందించేందుకు చర్యలు చేపట్టారు.


ఖలీద్‌కు స్కూటీ అందజేస్తున్న ఎఒ రాజ్‌కుమార్


చెత్తను చూపుతున్న సిపిఎం నేత పృథ్వీరాజు

సంతలో చెత్తను తొలగించరూ..

ప్రజాశక్తి - పెదబయలు రూరల్: పెదబయలు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి అనుకుని ఉన్న వారపు సంతలో చెత్తా చెదారం తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి కె పృధ్వీరాజు కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ మధ్య కాలంలో కురిసిన వర్షంతో చెత్తా చెదారం పేరుకు పోయి దోమల బెడదతో మలేరియా వంటి వ్యాధులు ప్రకలి ప్రజలకు ప్రాంతకరమైన వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. సోమవారం సంత జరిగి ఐదు రోజులైనా చెత్తను తొలగించక పోవడం సరికాదన్నారు. ప్రతి వారం సంత ఆశీలు పేరుతో వేల రూపాయలు వసూళ్లు చేయడం తప్ప సంతలో ఎటువంటి అభివృద్ధి శున్యమన్నారు. డంపింగ్ యార్డ్ వంటి సౌకర్యాలు చేపట్టాలన్నారు.తక్షణమే చేతను తొలగించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు.

ముంపు బాధితులకు ఆర్థిక సాయం ఏదీ?

సిఎం హామీ నెరవేర్చాలని గిరిజన సంఘం ర్యాలీ
సమస్యలపై అధికారులకు వినతి

ప్రజాశక్తి -చింతూరు : వరద బాధితులకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇస్తామన్న రూ. పదివేల ఆర్థికసాయం వెంటనే చెల్లించాలని గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఎజి.కోడేరు గ్రామ రచ్చబండ నుంచి సచివాలయం వరకు గిరిజన సంఘం జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి, సచివాలయం కార్యదర్శి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, మండల కార్యదర్శి కారం నాగేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల పట్ల వివక్ష చూపుతున్నాయన్నారు. వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు రూ.పదివేలు ఇస్తామని ప్రకటించిన సిఎం జగన్ నేటికీ అమలు చేయలేదన్నారు. జాతీయ ప్రాజెక్టు పోలవరంలో ముంపు నిర్వాసితులకు పరిహారం, పునరవాసం కల్పించి, సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లకుండా ఏటా వరదల్లో మునిగిపోయేలా చేస్తున్నారన్నారు.

వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుండా, వారి హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. జిఒ51ను రద్దు చేయాలని అల్లూరి ఏజెన్సీలో ఎర్రవరం, కొయ్యూరు మండలాల్లో చట్టాలకు విరుద్ధంగా నిర్మిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టును నిలుపుదల చేయాలని కోరారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యం విత్తనాలతో పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా తాగునీరు, వీధిలైట్లు, గ్రామాల్లో సిసిరోడ్డు, మరుగుదొడ్ల పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో ఎంపిటిసి జల్లి లావణ్య. గిరిజన సంఘం మండల అధ్యక్షులు పాండు నాగార్జున్, మండల నాయకులు కారం సుందరయ్య, ధర్మల మల్లయ్య, బీరబోయిన దిలీప్, స్థానికులు సోడే బాబూరావు, మడివి సత్యనారాయణ, కరక రాముడు, మడకం సీతమ్మ, ధర్మల బుచ్చమ్మ , రాములమ్మ, మిడియం సత్యవతి , బీరబోయిన లక్ష్మి పాల్గొన్నారు.



గిరిజన సంఘం ఆధ్వర్యాన నినాదాలతో ర్యాలీ చేస్తున్న మన్యవాసులు

అనారోగ్యంతో బాలిక మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని చెరుకుంపాలెం సచివాలయం పరిధిలో మర్రిపాలెం గ్రామానికి చెందిన బత్తుల లోవమల్లిక మొదటి కాన్పులో జన్మించిన ఐదు నెలల పసికందు గురువారం ఆకస్మికంగా మృతి చెందింది. జడ్డంగి పిహెచ్‌సి వైద్యాధికారి సుజి తెలిపిన వివరాల ప్రకారం, కన్నవారింటికి కాన్పుకు వచ్చిన బత్తుల లోవమల్లిక, ఐదు నెలల క్రితం ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది, పసికందుకు క్రమం తప్పకుండా టీకాలు కూడా వేయించారు. ఈనెల 21న బాలిక అనారోగ్యానికి గురికావడంతో జడ్డంగి పిహెచ్‌సికి తీసుకురాగా, వైద్యసేవలు అందించినప్పటికీ బాలిక ఆరోగ్యం విషమించి ఆకస్మికంగా మృతి చెందిందని డాక్టర్ సుజి తెలిపారు.


మృతి చెందిన పసికందు (ఫైల్‌ఫొటో)


మందులు పరిశీలిస్తున్న జమల్ భాషా

శిశు మరణాలను అరికట్టాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమల్ బాషా

ప్రజాశక్తి - పెదబయలు: గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమల్ భాషా సందర్శించారు. పిహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాలలో వైద్య సేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. శిశు మరణాలు రేటును తగ్గించి సుఖ ప్రసవాలకు చర్యలు తీసుకోవాలన్నారు. పిహెచ్‌సి సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పర్యటనలకు వెళ్ళేటప్పుడు మూమెంట్ రిజిష్టర్‌లో సంతకం చేయాలని సూచించారు. మినీ గురుకులాన్ని సందర్శించారు, పౌష్ఠిక ఆహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట అదనపు జిల్లా వైద్యాధికారి కె.లీలాప్రసాద్, ఎపిడెమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, వైద్యులు కిరణ్ ఉన్నారు.


మారేడుమిల్లి టిడిపి నిరసనలో మాట్లాడుతున్న వేణుగోపాలనాయుడు

అరాచక వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలి

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'లో టిడిపి నేతలు

ప్రజాశక్తి -మారేడుమిల్లి:: అరాచక వైసిపి ప్రభుత్వాన్ని వెంటనే గద్దె దించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు ఎర్ర వేణుగోపాల్‌నాయుడు పిలుపునిచ్చారు. గురువారమండలంలోని సోమిరెడ్డి పాలెంలో నిర్వహించిన ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసిప పాలనలో గిరిజన ప్రాంతంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ చేపడుతూ మన్యంలోని సహజ వనరులను దోపిడి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాల నడుస్తుందని సీఎం జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో చేసిన వాగ్దానాలను ఇప్పటికింకా నెరవేర్చలేదన్నారు. రంపచోడవరం నియోజకవర్గ సీనియర్ నాయకులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కార్యకర్తల మీద దాడులు ఎక్కువయ్యాయని, ప్రశ్నించే వారిని వేధించడం, అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో హత్య రాజకీయాలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షులు గురుకుశ కుమార్, ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు, ఉపాధ్యక్షులు కర్రీ సన్యాసి రెడ్డి, దూడ సువర్ణ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ పల్లాల్ రాజ్ కుమార్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ అందల సూర్యనారాయణ రెడ్డి, 11మండలాల తెలుగు దేశం శ్రేణులు పాల్గొన్నారు.

సీలేరు: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు, పాదయాత్రలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందలేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్‌పర్సన్ ఎంవివి ప్రసాద్ ఆరోపించారు. జీకే వీధి మండలం దారకొండ, గుమ్మరేవులు, దుప్పిలివాడ గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి, అరాచక పాలన, అవినీతి, వేధింపులతో రాష్ట్రభవిష్యత్‌ను అగమ్యగోచరం చేసేశారన్నారు. ధరభారం, పన్నులు, ఛార్జీలమోతతో పేదల జీవనం దుర్భరం చేశారన్నారు. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీకి జీతాలు ఇవ్వలేని దుస్థితికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చేశారని మండిపడ్డారు. మన్యంలో రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనలో నిండానిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. వైసిపి . ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మళ్లీ గాడీలో పడాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమొక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు జిల్లా టిడిపి కార్య నిర్వాహక అధ్యక్షుడు చల్లంగి లక్ష్మణరావు అరుకు పార్లమెంటు వైస్ ప్రెసిడెంట్ వరహాలు బాబు సీలేరు సీనియర్ నాయకులు బొర్ర కృష్ణ పాల్గొన్నారు.



సీలేరులో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'లో టిడిపి నేతలు

ట్యాబ్‌ల కొనుగోళ్లలో భారీ కుంభకోణం

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్: ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందించే ట్యాబ్‌ల కొనుగోళ్లలో భారీ కుంభకోణానికి తెరలేపారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. గురువారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. సీఎం పుట్టిన రోజున భారీ అవినీతి బయటపడిందన్నారు. రాష్ట్రంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సుమారు 5లక్షల ట్యాబ్‌లు పైగా ట్యాబ్‌ కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క ట్యాబ్‌ను రూ.13,262లకు కొనుగోలు చేశారని, మార్కెట్లో, ఆన్‌లైన్‌లో ఆ ట్యాబ్ విలువ రూ.11,999లకే లభిస్తున్నాయన్నారు.

రూ.13,262లకు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఒకేసారి 5లక్షల ట్యాబ్లు కొంటే ఇంకా రూ.9వేలకే వచ్చేది కదా అన్నారు. చిన్న పిల్లల చదువుకోవడానికి ఇచ్చే ట్యాబ్లలో కూడా దోపిడీ చేయడం సిగ్గు చేటన్నారు. ఈ ట్యాబ్ రూపంలో రూ.220కోట్ల తేడా వచ్చిందని, ఇవి ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనిపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై విచారణ చేసి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలకు ప్రభుత్వ సొమ్ము రూ.3కోట్లు విడుదల చేయడం ఏమిటన్నారు. ప్రభుత్వ డబ్బుతో జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు చేయడం రాష్ట్రానికి పట్టిన కర్మ అని అయ్యన్న విమర్శించారు.

సిఐ, ఎస్‌ఐలకు ఉత్తమ అవార్డులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ప్రతిభ కనబరిచిన పోలీసులకు పురస్కారాలు లభించాయి. అనకాపల్లిలో వార్షిక క్రైమ్ రివ్యూలో భాగంగా జిల్లా ఎస్పీ గౌతమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ ఏడాది ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. దీనిలో భాగంగానే నర్సీపట్నం టౌన్ సిఐ నమ్మి గణేష్‌కు జిల్లాలో ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు దక్కింది. ఎస్సైలు జి.గోవిందరావు, జి.ధనుంజయనాయుడులకు అవార్డులు దక్కాయి. అక్టోబర్ 17న నర్సీపట్నం రామారావుపేటలోని దస్రాల రామచంద్రరావు ఇంట్లో దొంగతనం కేసును 24 గంటల్లోపు ఛేదించడం, గంజాయి ముఠాలను పట్టుకోవడం తదితర వాటి నేపథ్యంలో ఎస్పీ వీరిని అభినందించారు.

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట ఎస్సై నాగకార్తీక్‌కు ఉత్తమ ఎస్సై అవార్డు దక్కింది. మండలంలోని 2022 ఏడాదిలో కేసుల పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో ఈ అవార్డు దక్కింది. ఈ మేరకు బుధవారం వార్షిక క్రైమ్ రివ్యూ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.ఎస్.గౌతమిశాలి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సైని సిబ్బంది, పలువురు నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

గడ్డికోత యంత్రంపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని అడ్డసరం గ్రామంలో రోలుగుంట పశు వైద్యాధికారి జి.సూర్యతేజరావు గురువారం గడ్డికోత యంత్రం పని తీరుపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. రాయితీపై ఇచ్చే యంత్రాలతో శాస్త్రీయ పోషణలో పశువులను మేపుకోవచ్చునన్నారు. గడ్డి వృథాగా పోకుండా చాఫ్‌కట్టర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎకరం భూమిలో గడ్డి వేసి నాలుగైదు పశువులకు ఒకటే పశువులకు ఒక గంటలో మేపుకోవచ్చున్నారు. దీంతో రెండు పశువులు గడ్డిని కోయవచ్చునని పేర్కొన్నారు. దీంతో కూలీల కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె పశుసంవర్ధక సహాయకులు రెడ్డి శివ, కంచుగుమ్మల, అడ్డసరం, కొత్తూరు, దిబ్బలపాలెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గురువారం అర్చక బృందం గోదాముక్కుల వరప్రసాద్ ఆచార్యులు, సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, గోదాదేవి అమ్మవారిని తిరువీధి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది నవీన్, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని స్థానిక పాండురంగ స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయని ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్న సమారాధన, ప్రత్యేక పూజలు, సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

జెడ్‌పిటిసి గంగరాజుకు వినతి

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ పరిధి జాముగుడ, బొరింగ్ వలస గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామాలకు చెందిన గిరిజనులు నర్సిస్, అర్జునుడు గురువారం స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతులమని అనారోగ్యాలకు గురైనప్పుడు కనీస అంబులెన్స్ దాని పరిస్థితి ఉందని తమ రెండు గ్రామాలకు చెందిన ప్రజలు ముందుకు వచ్చి ప్రమాదంతో నెల రోజులు నుండి రోడ్డు పనులు చేస్తూ రోడ్డు మార్గం మధ్యలో ఏర్పడిన మండలం తొలగించేందుకు సుమారు 60 వేల రూపాయలు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుందామని తెలిపారు ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్ జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు తన వంతు కషి చేస్తానని ఈ సమస్య ముందే తెలియ పర్చిఉండింటే సమస్య పరిష్కారనికి సర్యాలు తీసుకుని ఉండేవాడినని ఇప్పటికైనా సరే ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్. నాగులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జెడ్‌పిటిసి గంగరాజుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

వృద్ధులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని పద్మాపురం పంచాయతీ కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెన్షనర్స్ క్లబ్ ఆర్థిక సహాయంతో నిరుపేద వయో వృద్ధులకు, వికలాంగులకు గురువారం ఉచితంగా రగ్గులను పంపిణీ చేశారు. అరకులోయ మండలం అమలగూడ గ్రామానికి చెందిన శెట్టి జయదాస్, ఎస్‌బిఐ పెన్షనర్స్ క్లబ్ నాయకులు టీఎస్ మూర్తి, ఎం కోటేశ్వరరావు, కామేశ్వరరావు, డిజేసి భాషా ప్రసాద్‌లు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఏడాది పాడేరు ప్రాంతంలో కొంతమంది నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు ఉచితంగా రగ్గులు పంపిణీ చేపట్టామన్నారు. ఈ ఏడాది అరకు, డుంబ్రిగూడ మండలాల్లో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఎంతో కొంత సేవలందించాలన్న లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ క్లబ్ నాయకులు చంద్రమౌళి, పంత్,శర్మ, ప్రతాప్, గిరిజన ఐక్యవేదిక ప్రెసిడెంట్ చిట్టిబాబు, వైస్ సెక్రటరీ మల్లేష్ , కమిటి సభ్యులు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బిల్లింగ్ మిషన్ అందజేత

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మండలంలోని వంజంగి మేఘాల కొండలను సందర్శించే పర్యాటకుల ప్రవేశ బిల్లులు చెల్లించేందుకు అనువుగా డిజిటల్ బిల్లింగ్ మిషన్‌ను ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ నిర్వాహకులకు అందజేశారు. గురువారం వంజంగి కొండ టోల్ గేటును ఆయన సందర్శించారు. అదనంగా మరో రెండు బిల్లింగ్ యంత్రాలను సరఫరా చేయాలని నిర్వాహకులు కోరగా సానుకూలంగా స్పందించారు. వంజంగి కొండకు నెట్ సదుపాయం కల్పించాలని ఎంపిడిఓను ఆదేశించారు. గ్రావిటీ పథకాన్ని నిర్మించడానికి సాధ్య సాధ్యాలను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సాయి నవీన్, ఎస్‌ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.



డిజిటల్ బిల్లింగ్ మిషన్ అందజేస్తున్న పిఒ

12న యువశక్తి బహిరంగ సభ

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: శ్రీకాకుళం జిల్లా రణస్థలం లో జనవరి 12న జరిగే యువశక్తి బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఒ హోమ్‌లో యువశక్తి పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, వైసిపి పాలనలో ఉత్తరాంధ్ర ప్రాంతంలోని యువత వలసలు పెరిగి పోయా యన్నారు. జాబ్ క్యాడండర్ విడుదల చేయలేదన్నారు. పరిశ్రమలు కూడా రాష్ట్రానికి తీసుకురాలేని పరిస్థితి ఉందన్నారు. యువతలో చైతన్యమే లక్ష్యంగా యువశక్తి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సిఎం బహిరంగ సభ స్థల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల 28న నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ శంకుస్థాపన చేయనున్న సందర్భంగా నర్సీపట్నంలో బహిరంగ సభ నేపథ్యంలో ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి, జిల్లా ఎస్పీ గౌతమి శాలిని,ఎమ్మెల్యే గణేష్, ఆర్డిఓ భవాని శంకర్, ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్, సీఎం ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురాం తదితరులు స్థలాన్ని గురువారం పరిశీలించారు. మెడికల్ కాలేజీ శంకుస్థాపనపై ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడింది. మూడవసారి ఏ విధంగా అయినా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించాలని, నర్సీపట్నంలో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గణేష్ పట్టుదలతో కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు, నాయికులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా నర్సీపట్నం, చింతపల్లి మార్గంలో డిగ్రీ కాలేజ్ వద్ద, సిఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక, నర్సీపట్నం- కోటవురట్ల మార్గంలో జోగునాదుని పాలెం వద్ద తదితర ప్రాంతాలు పరిశీలన చేశారు. సీఎం హెలిప్యాడ్‌కు, బహిరంగ సభకు తక్కువ దూరం ఉండేలా పరిశీలన చేయాలని కార్యక్రమం కన్వీనర్ రఘురాం తెలియజేశారు. వీరి వెంట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, డిసిసిబి చైర్ పర్సన్ అనిత సన్యాసిపాత్రుడు, నర్సీపట్నం, గోలుగొండ, నాతవరం, మాకవరపాలెం ఎంపీపీ, జడ్పిటిసిలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు ఉన్నారు.

ఇసుకకు గిరాకీ

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో ఇసుకకు మంచి గిరాకీ ఏర్పడింది. ఎడ్లబండ్లతో తరలిస్తున్న ఇసుకకు ధరలు పెరగడంతో ఇసుక వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా సాగుతుంది.మండలంలో పిపి అగ్రహారం, కొండల అగ్రహారం, జి.కోడూరు, బి ఎస్‌పేట, జంగాలపల్లి తదితర గ్రామాల నుంచి ఎడ్ల బండ్లతో తరలిస్తున్న ఇసుకకు కాసులు కురిపిస్తున్నాయి. ఎడ్ల బండి ఒక్కంటికి వెయ్యి రూపాయల నుంచి 1200ల వరకు ధర పలుకుతుంది. ట్రాక్టర్ ఇసుక లోడు రూ.3500 ధర ఉంది. ప్రతిరోజు మండలంలో సుమారు 50 ఎడ్ల బళ్లతో ఇసుకను తరలిస్తున్నాయి. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు జోరు అందుకోవడంతో ఇసుక ధరలు బాగా పెరిగాయి. అధికారులు స్పందించి ఇసుకను తక్కువ ధరకు పంపిణీ చేయాలని కోరుతున్నారు

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పాయకరావుపేట: పట్టణంలోని 13వ వార్డులోని దుర్గాకోలనీ, ఇందిరా కోలనీలో నూతనంగా డ్రెయినేజీ పనులకు జడ్పిటిసి లంక సూర్యనారాయణ, సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దనిశెట్టి బాబురావు, వైసిపి పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీను, వైసిపి నాయకులు పెదపాటి మేకరంజన్, వార్డు మెంబర్లు తాటిపాక లావరాజ్, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మొక్కలను నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని నక్కపల్లి సిఐ నారాయణరావు తెలిపారు. మండలంలోని అడ్డురోడ్డు కూడలిలో గల జెడి కలెక్షన్స్ బట్టల దుకాణం నిర్వాహకులు ఉచితంగా మొక్కల పంపిణి చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, మొక్కలు నాటి ప్రాణదాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉచితంగా మొక్కలు పంపిణీ చేపట్టిన జెడి కలెక్షన్స్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బైలపూడిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని బైలపూడి గ్రామంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలో వృద్ధులకు, పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటపాడు జడ్పిటిసి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్ల అనురాధ, చీడికాడ మండలం జడ్పీటీసీ లాలం జానకిరామ్, చీడికాడ మండలం ఎంపీపీ కురచా జయమ్మ, దేవరపల్లి పార్టీ ప్రెసిడెంట్ బూరె బాబు రావు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

వాలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -కోటవురట్ల: నాతవరం మండలంలో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల అభ్యర్థులకు గురువారం ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవరం మండలంలోని ఏపీ పురంలో 2, ఎంబి పట్నంలో 2, ఎం.బెన్నవరంలో 2 పోస్టుల గాను ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సురేష్

పాత సామగ్రి విక్రయంపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు మండల రెవెన్యూ కార్యాలయంలోని పాతపత్రాలు, పాత కంప్యూటర్ సామగ్రిని అనధికారికంగా నాలుగురోజుల క్రితం విక్రయించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి సేసం సురేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పాత రికార్డులు, ఇతర సామగ్రి విక్రయించాలన్నా, డిస్పోజల్ చేయాలన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనల మేరకు చేయాల్సి ఉండగా, చింతూరు తహశీల్దార్ కార్యాలయంలో మ్తాం అలా చేయలేదని తెలుస్తోందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, డిఆర్ఒ, ఇతర సంబంధిత అధికారులతోపాటు ఐటిడిఎ పిఒ దృష్టి పెట్టి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై తహశీల్దార్ సాయికృష్ణను వివరణ కోరగా, తాను పనిమీద బయటకు వెళ్లిన సమయంలో కార్యాలయంలోని పాత సామగ్రి అమ్మేశారన్నారు. దీనిపై పరిశీలన చేస్తామన్నారు. సంబంధిత డిటి సుబ్బారావును వివరణ అడగగా, పాత పత్రాలు, పాత కంప్యూటర్ పరికరాలను అమ్మడం వాస్తవమేనని, అయితే అవి తహశీల్దార్ పర్యవేక్షణలో జరిగిందని అంటున్నారు. ఇలా తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ ఒకరికొకరు తమకు సంబంధం లేదని తప్పించుకోవడం, కార్యాలయంలోని పాత సామగ్రి విక్రయంపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సిపిఎం నేత సురేష్ డిమాండ్ చేశారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న స్థానికులు

సీలేరులో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో క్రిస్టమస్ సందడి ప్రారంభమైంది. ఏటా క్రిస్మస్ పండగకు మూడు రోజులు ముందు నుంచే శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులను తీర్చిదిద్ది సీలేరు పురవీధుల్లో తిరుగుతూ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ సందడి చేశారు. శాంతి క్లాస్ వేషధారణలో ఉన్న చిన్నారుల్ని చూసి స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

630వ రోజుకు జెఎసి దీక్షలు


ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రయివేటీకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారానికి 630వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు గోపాలపట్నం జోన్ కార్మికులు ఎస్.చిన్నారావు, ఎ.అప్పారావు, మాదాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గాన్ని కదిలించేలా పోరాటాలు

స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం
కనీస వేతనం కోసం పోరుబాట
సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పిలుపు
ఘనంగా సంఘం విశాఖ జిల్లా 12వ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కార్మికుడంటేనే మన వాడు. పని చేసే చోట.. నివాస ప్రాంతాల్లో కార్మికులను గుర్తించి యూనియన్‌లోకి తేవాలి. పోరాటాల దిశగా సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక శక్తిని సమీకరించాలి' - అని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ఉద్ఘాటించారు. గురువారం ఉదయం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె)లో సిఐటియు విశాఖ జిల్లా 12వ మహాసభలు ఉత్తేజపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వివిధ రంగాలకు చెందిన 360 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు ప్రారంభోపన్యాసం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 ఏళ్ల కాలంలో కార్మికవర్గం ఎన్నడూ లేని సమస్యలను నేడు ఎదుర్కొంటోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా తాము కార్పొరేట్లకు అనుకూలమని కార్మికవర్గానికి సవాలు విసురుతున్నాయని అన్నారు. దీన్ని ఎదుర్కొనడానికి యావత్ కార్మికవర్గాన్ని సమాయత్తం చేసే కృషిలో సిఐటియు తొలి నుంచీ అగ్రభాగానే ఉందని వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం తక్షణ కర్తవ్యంగా సిఐటియు భావిస్తోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ కోసం, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



సిఐటియు విశాఖ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

స్వాతంత్ర్య కాలంలోనే హక్కుల సాధన

రష్యాలో స్వాతంత్ర్యం వచ్చాక మన దేశంలో స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైందని, అల్లూరి, భగత్‌సింగ్ వంటి యువ నాయకులు ఉద్యమానికి బాటలు వేశారని అన్నారు. 18 ఏళ్లకే పని హక్కు, 60 ఏళ్ల తర్వాత ఉద్యోగ విరమణ, ఇతర ఆర్థికపరమైన హక్కులను కార్మికవర్గం సాధించిందన్నారు. ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వివి.గిరి లాంటి పలువురు నాయకులు ట్రేడ్ యూనియన్లలో పనిచేసినవారేనని నర్సింగరావు గుర్తుచేశారు. బిజెపి దేశంలో అధికారంలోకి వచ్చాక ప్రజలను రెచ్చగొట్టి, కుల, మత పరంగా చీల్చడం ద్వారా ప్రజా, కార్మిక ఉద్యమాలను బలహీనపరిచే కుట్రలకు పాల్పడుతోందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ కాలరాస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్రం నిర్ణయించిన క్షణం నుంచీ సిఐటియూ పోరాడుతూ.. ప్రైవేటీకరణను ఆపగలిగేలా కార్మికవర్గాన్ని సమీకరించగలుగుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సిఐటియు ఆ రకంగా ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని నేటికి 680 రోజులుగా నిర్వహించడం గొప్ప విషయమని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్రం రకరకాల కమిటీలు వేసినా కార్మికవర్గం ఐక్యంగా తిప్పికొడుతోందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని సిఐటియు డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఎన్నేళ్లు కార్మికుడు పనిచేసినా రూ.10 వేలు నుంచి రూ.15 వేలే అనే పద్ధతి పోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో ఉద్యోగ కల్పన చేస్తూ కార్మికవర్గాన్ని అణచి ఉంచుతున్నాయని, ఈ విధానాలపై పోరాటాలే సరైన మార్గమని, ఆ దిశగా మహాసభలో చర్చించాలని నర్సింగరావు ఆశించారు.

తొలి రోజు తీర్మానాలివే..

మహాసభ తొలి రోజు మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. స్టీల్‌ప్లాంట్ రక్షణకు విశాల ఐక్య ఉద్యమం నిర్మిద్దాం. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకుందాం' అని విశాఖ ప్రజానీకానికి మహాసభ విజ్ఞప్తి చేసింది. ఈ తీర్మానాన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జె.అయోధ్యరాం ప్రవేశపెట్టగా జెటిపి.ప్రకాష్ బలపర్చారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఎస్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సత్యనారాయణ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ బలపర్చారు. 'నివాస ప్రాంతాల్లో పనికి సిద్ధం అవ్వాలి' అనే తీర్మానాన్ని బి.జగన్ ప్రవేశపెట్టారు. ఆర్.లక్ష్మణమూర్తి బలపర్చారు.

అమరులకు ఘన నివాళి

మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు సీనియర్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు జెండావిష్కరణ చేశారు. ఇటీవల కాలంలో మరణించిన సంఘం నాయకులు ఎవి.రమణారావు, డి.అప్పలనాయుడు, ఎన్.రమణాచలం, ఆర్‌పి.రాజు, కె.సూర్యనారాయణ చిత్రపటాలకు రాష్ట్ర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవగీతాలు ఆలపించారు.

అధ్యక్ష వర్గం

ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా పి.మణి, ఆర్.లక్ష్మణమూర్తి, వై.రాజు, పి.వెంకటరెడ్డి వ్యవహరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పరిశీలకులుగా పాల్గొన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఈ మూడేళ్ళ కాలంలో నిర్వహించిన పోరాటాలు, వాటి అనుభవాలను తెలియజేశారు. కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్టుకు విరాళాల వెల్లువ

సిఐటియు జిల్లా మహాసభలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (ఎవికె) ట్రస్టుకు విరాళాలను విరివిగా అందజేశారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు రూ.3 లక్షల చెక్కును ఎవికె ట్రస్టు ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు, వివిఎస్.పద్మనాభరాజు, జె.అయోధ్యరామ్, జగ్గునాయుడు, కుమార్‌కు అందజేశారు. గతంలో ఈ యూనియన్ రూ.2 లక్షలను విరాళంగా ఇచ్చింది. మరో రూ.5 లక్షలను భవిష్యత్తులో ఇవ్వనున్నట్లు ఆ యూనియన్ వెల్లడించింది. స్టీల్‌ప్లాంట్ క్యాంటీన్ వర్కర్స్ రూ.లక్ష అందజేశారు. తోపుడుబండ్ల సంఘం కార్యదర్శి మూర్తి రూ.5 వేలు, ఎన్‌టిపిసి కార్మికులు రూ.5 వేలు అందజేశారు.

ఎన్ఇపికి వ్యతిరేకంగా పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఇపి) - 2020 పేరుతో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని, ప్రమాదకరమైన ఈ విధానాన్ని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. విద్య, ఉపాధి రంగాల సమస్యలపై పిడిఎస్ఒ ఆధ్వర్యంలో గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల విలీనం లాంటి విద్యా సంస్కరణల పేరుతో విద్యను సామాన్యుల నుంచి దూరం చేస్తున్నారన్నారు. వీటికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాట దిశగా ముందుకు సాగాలన్నారు. సీనియర్ న్యాయవాది, సామాజిక కార్యకర్త జహాఆరా ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రస్తుత విద్య సృజనాత్మకంగా కాకుండా మూస పద్ధతిలో, మానవ యంత్రాలను తయారు చేసే విధంగా ఉందన్నారు. హిందుత్వ భావజాలంతో విద్యార్థుల మెదళ్లను నింపుతూ విద్యను కాషాయీకరిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ సమస్యతో పోరాడుతున్న యువతను రిజర్వేషన్ల పేరుతో పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి అమరవీరుల బాటలో, వారి స్ఫూర్తితో యువత పోరాడాల్సిన అవసరముందన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సమగ్రమైన పాఠశాలలను, కళాశాలలను నిర్మించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు సరిపడా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేక, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయక విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. మరోవైపు నిరుద్యోగంతో యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో యువతకు పోరాటమే ముందున్న పరిష్కారమన్నారు.

పిడిఎస్ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షలా 30 వేల పోస్టులను, కేంద్రంలో ఉన్న 60 లక్షల పోస్టులను పాలకులు భర్తీ చేయట్లేదని తెలిపారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ నిరుద్యోగ సైన్యాన్ని పెంచి పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. కుల, మత ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. వీటన్నిటినీ సరైన కోణంలో అర్థం చేసుకుంటూ పాలకులు అనుసరిస్తున్న విద్య, ఉపాధి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉందన్నారు. పిడిఎస్ఒ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌతమి అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో నవ యువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.బాషా, పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్ మాట్లాడారు. ఎల్.భాను, ఎస్.రుద్రి, కె.సోమేశ్, పి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

శ్రీ కనకమహాలక్ష్మి ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా చివరి గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకునేందుకు బుధవారం అర్ధరాత్రి నుంచి భక్తులు క్యూలు కట్టారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వికలాంగుల కోసం వీల్ చైర్లు సమకూర్చింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసింది. శుక్రవారంతో శ్రీ అమ్మవారి ఉత్సవాలు ముగియనుండడంతో దేవస్థానం భక్తులతో నిండిపోయింది. గురువారం మధ్యాహ్నం కొత్తరోడ్డులోని శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో మహా అన్నదానం నిర్వహించారు. 20 వేల మందికి రుచికరమైన వంటకాలను అందించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్డర్స్ మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : హెల్పేజ్ ఇండియా, ఎల్డర్ లైన్ 14567 సంయుక్త ఆధ్వర్యంలో 'ఎల్డర్స్ మేళా' కార్యక్రమాన్ని గురువారం జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసా హాలులో నిర్వహించారు. అందులో భాగంగా వృద్ధులకు సంబంధించిన, అవసరమైన స్టాల్స్ ఏర్పాటు చేశారు. డిఎల్‌ఎస్‌ఎ, కేరేజియర్ సర్వీసెస్ 2050, విశాఖ కంటి హాస్పిటల్, అమ్మ ఆప్టికల్స్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కేర్, ఎఆర్‌డిఎస్ వాకర్స్ అసోసియేషన్, వృద్ధాశ్రమాలు, పినాకిల్ హాస్పిటల్ స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా వృద్ధులకు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శశిప్రభ స్టాల్స్‌ను ప్రారంభించారు డిఎల్‌ఎస్‌ఎ సెక్రటరీ బులికృష్ణ, విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్డర్ లైన్ టీమ్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.